నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, బుధవారం 5 మార్చి 2025 | HYDERABAD


# బస్ షెల్టర్లలో డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు

## పీపీపీ విధానంలో ఆమలుకు జీహెచ్‌ఎంసీ టెండర్లు

సిటీబ్యూరో, మార్చి 4 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లోని అన్ని బస్ షెల్టర్లలో డిజిటల్ డిస్ ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. రైల్వే తరహాలో బస్సు రాకపోకలపై కచ్చితమైన సమాచారంతో పాటు ఆదాయాన్ని పెంచుకోవాలని భావిస్తున్నది. ఇందులో భాగంగానే పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ పద్ధతిలో ఆసక్తి గల ఎజెన్సీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ టెండర్లను పిలిచింది. బస్సు ప్రయాణం సులభతరం చేయడం, ప్రైవేట్ భాగస్వామ్యం చేసి ఆదాయాన్ని పెంచుకోవాలని భావిస్తున్నది. ఈ మేరకు ఈ నెల 20న దరఖాస్తులు సమర్పణకు గడువు విధించింది. ఆయా ఎజెన్సీలతో ఈ నెల 28న ప్రత్యేక సమావేశం ఉంటుందని, సంబంధిత ప్రజెంటేషన్లు ఎజెన్సీలు ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. వచ్చే నెల 21వ తేదీ ఉత్తమ ప్రతిపాదనలను ఖరారు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## కాంగ్రెస్ రాగానే షెల్టర్‌పై కొందరి కన్ను

ఎర్రగడ్డ, మార్చి 4: బోరబండ బస్ టెర్మినల్ వద్ద ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకూ ఎప్పుడు చూసినా కనీసం 60 మంది కనిపిస్తారు. ప్రయాణికుల సౌకర్యార్థం టెర్మినల్లో గత రెండేండ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఏసీ బస్ షెల్టర్ ను ఏర్పాటు చేసింది. ఐతే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బస్ షెల్టర్ పై కన్ను పడింది. దాన్ని స్వాధీనం చేసుకుని పెద్ద మొత్తంలో కిరాయికి ఇవ్వటానికి ఎత్తుగడ వేశారు. రాత్రికి రాత్రి ఏసీ బస్ షెల్టర్‌కు షట్టర్‌ను బిగించారు.




బస్ షెల్టర్ కు రాత్రికి రాత్రి షట్టర్‌ను బిగించిన దృశ్యం



ఇందిరమ్మ కాలనీ లో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన రేకుల గదులను తొలగిస్తున్న హైడ్రా అధికారులు.. తమ ఇండ్లను ఎలా కూలగొడుతారంటూ ప్రశ్నిస్తున్న బాధితులు

# బడుగుల ఇండ్లపై పడగెత్తిన హైడ్రా




### నిజాంపేట ఇందిరమ్మ కాలనీ లో హైడ్రా కూల్చివేతలు

### రోడ్డుకు అడ్డంగా ఉన్నాయంటూ ఆక్రమణల తొలగింపు

### పేదల పొట్టగొడితే.. ప్రభుత్వానికి మా ఉసురు తగులుతది

### రోడ్డుపై బైఠాయించి స్థానికులు ఆందోళన

**హైడ్రా మరోసారి బడుగుల ఇండ్లపై పడగెత్తింది. ఇందిరమ్మ ఇండ్లలో నివాసం ఉంటున్న నిరుపేదలు తమ ఇంటి ముందున్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసుకున్న రేకుల రూములను నిర్ధాక్షిణ్యంగా కూల్చివేశారు. పేదలపై ప్రతాపం చూపుతున్న అధికారులు పెద్దల ఆక్రమణలను ఎందుకు అడ్డుకోలేకపోతున్నారని బాధితులు మండిపడ్డారు. రోడ్డుకు అడ్డంగా అధికారులు కూల్చివేసిన సామాన్లు వేసి బైఠాయించి నిరసన తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్యాయంగా తమ ఇండ్లను కూల్చివేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.**



రోడ్డుపై అడ్డంగా సామాన్లు వేసి నిరసన తెలుపుతున్న ఇందిరమ్మ కాలనీవాసులు

దుండిగల్, మార్చి 4: కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ ఫేజ్-2 నుండి బాలాజీ హిల్స్ కాలనీ, కే టీ ఆర్ కాలనీకి వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఇందిరమ్మ కాలనీవాసులు తమ ఇండ్ల ముందున్న స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన రేకుల రూములను హైడ్రా అధికారులు మంగళవారం కూల్చివేయడంపై ఉద్రిక్తకు దారితీసింది. రాకపోకలకు ఇబ్బందిగా ఉన్నాయనే నెపంతో గత కొంతకాలంగా బాలాజీ హిల్స్, కేటీఆర్ కాలనీవాసులకు, ఇందిరమ్మ ఇండ్ల నివాసుల మధ్య వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో మంగళవారం హైడ్రా అధికారులు, సిబ్బంది తో పాటు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, భారీ పోలీసు బందోబస్తు, జేసీబీలతో ఇందిరమ్మ కాలనీ ఫేజ్ లో రోడ్డు కు ఇరువైపుల ఉన్న చిరు వ్యాపారాల కోసం ఏర్పాటు చేసిన రేకుల రూములను కూల్చివేశారు. కొందరు సామాన్లు తీసుకుంటామని వేడుకున్న అధికారులు కనికరించలేదని, దీంతో తాము లక్షలాది రూపాయలు నష్టపోయామని పలువురు ఇందిరమ్మ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధుల మైన తాము చిన్నపాటి కొట్టును అప్పు చేసి ఏర్పాటు చేసుకున్నామని, ఇంకా అప్పు తీరక ముందే అధికారులు తమ ఇంటి ముందున్న షెడ్డును కూల్చివేయడంతో వృద్ధ దంపతులు విలవిలలాడారు. 70 ఏళ్ల పై చీలుకు వయసులో తాము ఎలా బతకాలంటూ విలపించారు. మరో వైపు హైడ్రా అధికారుల కూల్చివేతలను నిరసిస్తూ కాలనీవాసులు బాలాజీ హిల్స్ కాలనీ కమాన్ వద్ద రోడ్డుకు అడ్డంగా అధికారులు కూల్చిన సామానువేసి బైఠాయించారు. ప్రభుత్వానికి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమకు ముందస్తు సమాచారం ఇచ్చిన సామాన్లు తీసి బయట పెట్టుకునే వారమని వాపోయారు.

#### ఇందిరమ్మ ఇండ్లనే కూలుస్తారా



కాంగ్రెస్ ప్రభుత్వం అంటే ఇందిరమ్మ రాజ్యమని, ఇందిరమ్మ రాజ్యంలోనే ఇందిరమ్మ ఇళ్లను కూలుస్తారా ! ఏమిటి అన్యాయం. వాళ్ళు ఇచ్చిన ఇండ్లలోనే ఉంటున్నాం.. ఇదెక్కడి న్యాయం. పదిహేను ఏళ్ల క్రితం ఇచ్చినప్పుడు పాములు, విష పురుగులు తిరిగేవి. అన్నీ తట్టుకొని ఉంటున్నాం. ఇప్పుడు రోడ్డుకు అడ్డుగా ఉన్నాయంటూ గుడారాలను కూల్చి పొట్ట మీద కొడుతున్నారు. **- దుర్గ, స్థానికురాలు**

#### మా ఉసురు తగులుతది



పొట్టకూటి కోసం మా ఇంటి ముందర చిన్న షాప్ పెట్టుకున్నాం. చిన్న చిన్న ప్లాస్టిక్ వస్తువులు అమ్ముకుంటూ జీవనోపాధిని పొందుతున్నాం. అపార్ట్మెంట్ల వాసులను కాదని, మా గూడును కూలిస్తున్న వారికి తప్పకుండా ఉసురు తగులుతుంది. మా ఇండ్లను కులగొట్టినంతమాత్రాన అపార్ట్మెంట్ల వాళ్లకు రోడ్డు ఇవ్వము ఏం చేసుకుంటారో చేసుకోండి. **- తిరుపతమ్మ**

#### ఇప్పుడు ఎలా బతికేది



వయసు 70 ఏళ్ల పైబడి ఉంది. మా ఇంటి ముందు ఉన్న ఖాళీ జాగాలో అందరి మాదిరిగానే చిన్న రేకుల దుకాణం ఏర్పాటు చేసుకొని బతుకుతున్నాం. ఇందు కోసం అప్పు కూడా చేశాం. అప్పు తీరక ముందే అధికారులు రేకుల రూమును తొలగిస్తుంది. ఏ పని చేయలేని వయసులో జీవనోపాధిని ప్రభుత్వం కూల్చివేసింది. ఇప్పుడు మేము ఎలా బతకాలి. ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. **- శాంత**

#### ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు



కూల్చివేతలకు ముందు మున్సిపల్ అధికారులు, హైడ్రాధికారులు కానీ ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. నిజంగా రోడ్డు ఆక్రమణలను తొలగించాల్సి వస్తే కేటీఆర్ కాలనీ నుంచి బాలాజీ హిల్స్ కాలనీ మీదుగా అన్ని తొలగించాలి. కానీ అధికారులు కొందరినీ టార్గెట్ చేసి కొన్ని ఇలాంటి మాత్రమే కూల్చివేయడం ఎటువంటి న్యాయం అనుకోవాలి. **- జ్యోతి**

# నగర పౌరులపై పెనాల్టీల భారం!

### భారీ జరిమానాలకు సిద్ధమవుతున్న జీహెచ్‌ఎంసీ

### స్వచ్ఛ కార్యక్రమాల ఉల్లంఘనులపై ప్రత్యేక యాప్

### ట్రాఫిక్ పోలీసుల తరహాలో ఈ-చలాన్లు

### వచ్చే వారం నుంచి అమలు




సిటీబ్యూరో, మార్చి 4 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ పౌరులపై జరిమానాల భారం మోపేందుకు జీహెచ్‌ఎంసీ సిద్ధమవుతుంది. స్వచ్ఛ కార్యక్రమాల అమలు ముసుగులో ఏ చిన్న ఉల్లంఘన జరిగిన పెనాల్టీలు వేసి ఖజానాను నింపుకునే పనిలో నిమగ్నమైంది. రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసిన వారు.. నిబంధనలు ఉల్లంఘించి ప్లాస్టిక్ కవర్ల వినియోగం, ఇష్టారాజ్యంగా భవన నిర్మాణ వ్యర్థాలు వేసే తదితర ఉల్లంఘనులను గుర్తించి జీహెచ్‌ఎంసీ చలాన్లు విధిస్తూ వస్తున్నది. మ్యాన్‌వల్ విధానంలో ఉన్న ఈ విధానాన్ని ట్రాఫిక్ పోలీస్‌ల మాదిరిగా ఈ-చలాన్లను విధించనున్నారు. ఈ మేరకు టాటా కన్సల్టెన్సీ సహకారంతో ఈ-చలాన్ల జారీకి సంబంధించి ప్రత్యేక యాప్‌ను సిద్ధం చేశారు. ఈ వారంలో యాప్‌పై సంబంధిత అధికారులకు శిక్షణ ఇచ్చిన తర్వాత యాప్‌ను వినియోగంలోకి తెస్తామని జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ సీఎన్ రఘు ప్రసాద్ తెలిపారు. ఏ ఉల్లంఘనకు ఎంత పెనాల్టీ విధించాలో యాప్ ద్వారా ఆటోమేటిక్‌గానే జనరేట్ అవుతుందన్నారు. పెనాల్టీలను యూపీఐ ద్వారానే చెల్లించాల్సి ఉంటుందన్నారు. మొత్తంగా ట్రాఫిక్ పోలీసుల తరహాలోనే ఏఎంఓహెచ్‌లు, డీఈఈలు, ఏసీపీలు తదితర అధికారులు ఈ-చలాన్ లు జారీ చేయనున్నారు. కాగా రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసిన వారికి ఈ ఏడాది మార్చి 3 వరకు రూ.2,33 లక్షల పెనాల్టీలు విధించారు.

### 4 నెలల్లో రూ.54.15 లక్షల జరిమానాలు

భవన నిర్మాణ వ్యర్థాల తరలింపులో భాగంగా నగరం నలువైపులా సీ అండ్ డీ (భవన నిర్మాణ) వ్యర్థాల శుద్ధికి 30 సర్కిళ్లలో నాలుగు ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగించారు. జీడిమెట్ల, ఫతుల్లాగూడ రిసైక్లింగ్ ప్లాంట్ హైదరాబాద్ సీ అండ్ డీ వేస్ట్, సోమ శ్రీనివాస్ రెడ్డి కంపెనీ శంషాబాద్, తూంకుంటలో రిసైక్లింగ్ ప్లాంట్‌కు తరలించి వ్యర్థాలను శుద్ధి చేస్తున్నారు. మెట్రిక్ టన్నుకు రూ.419 నుంచి రూ.104ల వరకు ఛార్జి చేసి వ్యర్థాలను ప్లాంట్‌కు తీసుకువెళ్తున్నారు. ఐతే ఈ తరలింపు ప్రక్రియలో సమన్వయ లోపంతో సజావుగా సాగడం లేదు. దీంతో భవన నిర్మాణ యాజమానులు ఇష్టారాజ్యంగా ఎక్కడపడితే వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గడిచిన నెల రోజులుగా వ్యర్థాలను డంపింగ్ వేస్తున్న 1158 డెబ్రీస్ పాయింట్లను గుర్తించారు. తరచూ వేస్తున్న దాదాపు 762 పాయింట్లను గుర్తించి సంబంధిత డంపింగ్ చేస్తున్న వారికి జరిమానాలు విధించారు. ఈ నేపథ్యంలోనే 30 సర్కిళ్ల నుంచి గడిచిన నాలుగు నెలల వ్యవధిలో రూ.54.15 లక్షల మేర జరిమానాలు విధించినట్లు అధికారులు పేర్కొన్నారు.



అధికారులతో కలిసి కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

# అభివృద్ధి, సంక్షేమంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

### ప్రచారానికే ప్రభుత్వ పాలన పరిమితం


### మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ఆర్కే పురం, మార్చి 4: అభివృద్ధి, సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం సరూర్నగర్ డివిజన పరిధిలోని హుడా కాంప్లెక్స్, హుడా కాలనీలో వివిధ శాఖల అధికారుల తో కలిసి పర్యటించి స్థానిక ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలను తీసుకురావడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హుడా కాంప్లెక్స్ పెరిగిన జనాభా కనుగుణంగా డ్రైనేజీ సామర్థ్యాన్ని పెంచేందుకు పనులకు ప్రతిపాదన సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కాలనీలోని సమస్యలను ప్రజలు తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు పాటుపడతామన్నారు. అదేవిధంగా అసంపూర్తిగా ఉన్న మహిళా మండలి భవనాన్ని త్వరగా పూర్తిచేస్తే 15వ తారీకు నాడు ఇనాగరేషన్ చేస్తానని చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో మాజీ సీఎం కేసీఆర్ ఒక విజన్ తో మిషన్ భగీరథ, కాకతీయ ద్వారా త్రాగునీరు, సాగునీరు అందించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో త్రాగునీరు, సాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉన్న నీటిని అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం టీఆర్ఎస్ యూత్ వింగ్ మాజీ అధ్యక్షులు లోకసాని కొండల్ రెడ్డి, సరూర్నగర్ సర్కిల్ డిసి సుజాత, టీఆర్ఎస్ నాయకులు ధర్పల్లి రాజశేఖర్, సిరిపురం రాజేష్ గౌడ్, కొండ గిరి గౌడ్, సుశీల రెడ్డి, ప్రత్యూష, ఇస్మాయిల్, జహీర్ తదితరులు ఉన్నారు.

# ఇసుక చిరు వ్యాపారులపై వేధింపులు ఆపాలి

### ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 4: జీవనోపాధి కోసం రోడ్లపై ఇసుకను అమ్ముతున్న చిరు వ్యాపారులపై పోలీసుల వేధింపులు ఆపాలని ప్రభుత్వం తీసుకొచ్చిన విధానపరమైన నిర్ణయాలపై వారికి అవగాహన కల్పించాలని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణారావుకు అల్లాపూర్ కు చెందిన ఇసుక చిరు వ్యాపారులు వినతి పత్రాన్ని అందించారు. అల్లాపూర్ లోని రోడ్లపై గత కొన్ని సంవత్సరాలుగా రోడ్ల పక్కన ఇసుక వ్యాపారం చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నామని ఇటీవల కాలంలో పోలీసులు ఇసుక వ్యాపారులపై కేసులు నమోదు చేస్తూ.. ఇసుక వాహనాలను సీజ్ చేస్తున్నారని, భారీ జరిమానాలు వేస్తున్నారని దీంతో తామంతా రోడ్డున పడాల్సి వస్తుందని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వయం ఉపాధి కోసం రోడ్ల పక్కన ఇసుక చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్న వారిని పోలీసులు ఇబ్బంది పెట్టడం తగదని అన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానాలు ఏమైనా ఉంటే అక్కడ వ్యాపారం చేసుకునే వారికి వివరించాలని, వారి జీవనోపాధికి ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపించాల్సిన బాధ్యత పోలీసులు, అధికారులపై ఉందన్నారు.



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు వినతిపత్రం ఇస్తున్న అల్లాపూర్ ఇసుక చిరు వ్యాపారులు



కార్పొరేషన్ కార్యాలయం ముందు బైఠాయించిన ఎన్యూమరేటర్లు, అఖిలపక్షం నాయకులు

# జీతాలివ్వండి మహా ప్రభో!

### పని చేసినా డబ్బులివ్వని కాంగ్రెస్ ప్రభుత్వం

### ఎన్యూమరేటర్ల ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ముట్టడి

జవహర్‌నగర్, మార్చి 4: సమగ్ర కుటుంబసర్వేలో పనిచేసి నెలలు గడుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్యూమరేటర్లకు డబ్బులు చెల్లించలేని దుస్థితిలో ఉందని ఎన్యూమరేటర్లు, అఖిలపక్షం నాయకులు దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో జవహర్‌నగర్ కార్పొరేషన్ చెందిన పలువురు విద్యార్థులు, గృహిణులు సుమారు 288 మంది సర్వే చేసిన సంగతి విధితమే. కష్టపడి పనిచేసి నెలలు గడుస్తున్నా డబ్బులు చెల్లించకపోవడంతో మంగళవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఎన్యూమరేటర్లు, అఖిలపక్షం నాయకుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లు, అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క కుటుంబసర్వేకు రూ. 150కోట్లు నిధులు కేటాయించామని చెప్పిన.. ఆడబిడ్డలను కార్యాలయల చుట్టూ తిప్పుకోవడం ఏంటని ప్రశ్నించారు. అనంతరం ఎన్యూమరేటర్లు, అఖిపలక్షం నాయకులు కమిషనర్ వసంతకు విన్నవించారు. స్పందించిన కమిషనర్ ఉన్నతాధికారులకు విన్నవించి త్వరలోనే ఎన్యూమరేటర్లకు డబ్బులు అందేలా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అహ్మద్‌పాషా, జక్కుల భాస్కర్, విక్రమ్, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.


మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ | Telangana Today

PRESENT




**లక్షల మందిని చేరుకునే సలక్షణ వేదిక**

అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న నిజామాబాద్ మరియు పరిసర ప్రాంతాల్లోని అన్ని ప్రముఖ సంస్థల ప్రాపర్టీలు, హైదరాబాద్‌లోని ప్రఖ్యాత రియాల్టీ ప్రాపర్టీలు ఒకే వేదికపైన మరియు తక్షణ రుణ సదుపాయం కొరకు ప్రముఖ జాతీయ బ్యాంకులు కూడా అదే వేదికపై అందుబాటులో ఉంటాయి.

**08 - 09, మార్చి 2025**

వేదిక: వేణు మాల్ (హోటల్ నిఖిల్ సాయి)

దేవి థియేటర్ క్రాస్ రోడ్డు, హైదరాబాద్ రోడ్డు, నిజామాబాద్

Digital Partner: S TV | TV Sponcer: T News

Main Sponsor: VASAVI GROUP – You dream. We deliver.

Co-Sponsor: SVC

In Association With: SRI ASHOKA BUILDERS & DEVELOPERS, AISHWARYAM HOMES, ROYALOAK NIZAMABAD, APD, ANKURAM, BHOOMI SPACE, SUNYUGA INFRA PVT. LTD., DIVINE, TMR GROUP – Think PLOTS. Think TMR, SHRI SLN PROPERTIES, AKSHAYA ENTERPRISES, ADURI GROUP, Sri Govinda Sai Builders & Developers

**Booking Enquiry: Nizamabad - 9182777399, 9182777590**